## క్లుప్తంగా

### దుర్గమ్మ సేవలో టీటీడీ చైర్మన్ భూమన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టీటీడీ పాలకమండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భూమనను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం భూమనకు వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ చైర్మన్ , ఈవోలు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని, పట్టు వస్త్రాలను అందజేశారు.

### కొండ ప్రాంతాల్లో అన్ని మౌలిక సదుపాయాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మీ తెలిపారు. 48వ డివిజన్ 155వ సచివాలయం పరిధిలో రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టిన వాల్ నిర్మాణ పనులకు బుధవారం ఆదిలక్ష్మీ పూజలు నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొండ ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంలో ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. స్థానికులకు ఉపయోగకరంగా ఉండేలా ఈ వాల్ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, దుక్క దుర్గారావు, జగదీష్, ఈ. శ్రీను, బాయన అమర్‌నాథ్, సీహెచ్. రాజు, అద్దూరి శ్రీను, సచివాలయం ఇంజినీరింగ్ సెక్రటరీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మధురంగా సాగిన వీణా వాద్య కచేరి

విజయవాడకల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140 వ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని చిట్టూరి కళావేదికపై నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారుడు చిట్టా కార్తీక్ త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, అన్నమయ్య కీర్తనలను మధురంగా వీణపై పలికించారు. నగుమోము కనలేని, బ్రోచేవారెవరురా, రఘువంశ సుధాంబుధి చంద్ర, నారాయణతే నమో నమో, థిల్లానా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగంపై, హరిబాబు ఘటంపై సహకరించారు. గురువారం నాటి కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ కల్యాణి ఏకరాగ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యురాలు అంజనా సుధాకర్ తెలిపారు.

### కోదండరామునికి విశేష అభిషేకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని భావనారాయణవీధిలో కొలువై ఉన్న శ్రీ కోదండరామునికి బుధవారం పలు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో కార్తీక మాసంలో పునర్వసు నక్షత్రం తిథి నుంచి నవమి వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం స్వామి వారికి విశేష స్నపనాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం సమస్రనామార్చన శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే ఉపాలయంలోని ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు దీవి రాఘవేంద్రదీక్షితులు నిర్వహించారు.

### కొట్లాట కేసులో నిందితుడికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: న్యూ ఆర్‌ఆర్‌పేటలోని ఓ టీ స్టాల్ వద్ద గత ఏడాది నవంబర్ 24వ తేదీన జరిగిన కొట్లాట కేసులో నిందితుడు గోనా కిషోర్‌కు నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సి.రమణారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. టీ స్టాల్ వద్ద టీ తాగుతున్న ఓ వ్యక్తిని డబ్బులు ఇవ్వమని నిందితుడు కిషోర్ బెదిరించాడు. డబ్బులు లేవని చెప్పడంతో నిందితుడు కిషోర్ తనపై పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఐదుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు కిషోర్‌కు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

# అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుస్తున్న సీఎం జగన్

**ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది**

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాడు అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ఈనాటికీ దేశ వ్యాప్తంగా అమలవుతుందంటే అది ఆయన నిబద్ధతతో కూడిన ఆలోచనా విధానానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగాగల అంబేడ్కర్ విగ్రహానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అంబేడ్కర్ ఆశయాలను తూచా తప్పకుండా పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందరికీ సమన్యాయం జరగాలని, అలాగే ప్రతి ఒక్కరికీ అన్ని రంగాల్లో అవకాశాలు లభించే విధంగా రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజల గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు.

**సామాజిక న్యాయానికి పెద్ద పీట...**

దేశంలో మరెక్కడా లేని విధంగా సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసి దాన్ని అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సామాజిక అసమానతలను తొలగించేందుకు విద్య ఒక ఆయుధంలా ఉపయోగపడుతుందని, అందుకే సీఎం జగన్ విద్యారంగానికి ప్రాధాన్యతనిచ్చి విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. సమసమాజం కోసం కృషి చేసిన అంబేడ్కర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధిర ప్రభాకర్, నాయకులు లేళ్లపూడి లాజర్, కామళ్ల జోజి, గుండె సుందర్‌పాల్, బోడే ప్రేమ్, నాగళ్ల సంగీత్ బాబు, దాసి జయప్రకాష్ కెనడీ, కె.కమలాకర్, ఎం. రమేష్, మంచాల రాజు, రుద్రశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా పాలన సాగిస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు ఇర్ఫాన్, ఆంజనేయ రెడ్డి, కోటిరెడ్డి, చైతన్య రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు బుదాల శ్రీనివాసరావు, కామళ్ళ జోజి, నన్నెం దుర్గ, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తనుబుద్ధి చంద్రశేఖరరెడ్డి, జోసఫ్, పి.రమేష్, బి.అప్పారావు, వరకాని థామస్, నరసింహారావు, కె.సాయికుమార్, కోటేశ్వర రావు, గాలి గురవయ్య, పి.శేఖర్, లాజర్, కమలాకర్, ఆనంద్ రావు, లేళ్లపుడి లాజర్, గద్దం సాంబ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, ఎమ్మెల్సీ రుహుల్లా, తూర్పు ఇన్‌చార్జి దేవినేని, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

**దేశాభ్యున్నతికి మార్గదర్శకం చేసిన అంబేడ్కర్**

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మార్గదర్శకం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు అన్నారు. ది నేషనల్ ఫ్రూట్స్ హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు ఎస్సీ సెల్ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శరత్ బాబు ఇతర నేతలతో కలిసి ప్రారంభించారు. శరత్ బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు కలుకూరి కమలాకర్, గురు ప్రసాద్, పారా రాజు, కంది రమేష్, మధిర ప్రభాకర్, దాసి కేనడి, జొజ్జి, సంగీత్‌బాబు, మజ్జి శ్రీను, విజయ్, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**బాబా సాహెబ్‌కు ఘన నివాళి**

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్వేచ్ఛ, సమానత్వం, అంటరానితనం నిర్మూలనే లక్ష్యంగా సమ సమాజ స్థాపనకు పాటుపడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం రైల్వే ఆడిటోరియంలో మహా పరినిర్వాన్ దివాస్ పేరుతో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్ఎం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ బాబాసాహెబ్ అన్ని వర్గాల ప్రజలకు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అందేలా రాజ్యాంగం రూపొందించి కోట్లాది మంది భారతీయకులకు మార్గదర్శకులుగా నిలిచారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పటిష్టంగా నిర్మించి, సమసమాజ స్థాపనకు, కార్మికలోక సంక్షేమానికి కృషిచేసిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అన్నారు. ఆయన స్ఫూర్తితో బాబా సాహెబ్ పుస్తకాన్ని చదివి ప్రేరణ పొందాలని సూచించారు. ముందుగా ఆడిటోరియంలో ప్రదర్శించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర షార్ట్‌ఫిల్మ్‌కు ప్రేక్షకుల నుంచి చప్పట్లతో పెద్ద ఎత్తున ఆదరణ పొందింది. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీపీఓ బాలమురళీధర్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్, ట్రేడ్ యూనియన్, ఆల్ ఇండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



అంబేడ్కర్ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న పోలిమెట్ల శరత్‌బాబు

**సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్న సీఎం జగన్**

భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక న్యాయాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని చైతన్య మాల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని టీనర్ పేటలోని టీఎమ్‌హెచ్ హైస్కూల్ దగ్గరగల అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోదావరి గంగ, బాబు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం పోరాడిన యోధుడు అంబేడ్కర్ అన్నారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. యువత ఆయన జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు గోదావరి బాబు పోతుల వెంకటరావు, గాలి దుర్గా ప్రసాద్ (జీడీ), జి.గురుప్రసాద పగిడిపల్లి రాజేష్, బత్తుల కోటేశ్వరరావు, పి.యేసురాజు, కె కమలాకర్, జడ సునీల్ కుమార్, పీ జీవన్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గోదావరి గంగ, బాబు తదితరులు

**అంబేడ్కర్ మార్గం ఆదర్శనీయం**

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్య్ర సమరయోధుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గం ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఆకుల రాజేశ్వరరావు వీధిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం అనే పదాలను చేర్చడం ద్వారా దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ తాను భారతీయుడనని ప్రకటించుకునే హక్కు అంబేడ్కర్ కల్పించారని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాల సాధనలో భాగంగా సీఎం జగన్ ప్రభుత్వం విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. దళిత నాయకుడు పాదిలి చంటిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ సారథ్యంలో అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో యాకూబ్, షేక్ కరీం, అశోక్, శివప్రసాద్ చారి, రవి, షానూర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆకుల శ్రీనివాస్, పాదిలి తదితరులు

## రేకుల నివాసంపై కూలిన చెట్టు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా బుధవారం తెల్లవారుజామున 50వ డివిజన్, గొల్లపాలెంగట్టురోడ్డు కొండ ప్రాంతంలో భారీ వృక్షం కూలి పక్కనే ఉన్న రేకుల నివాసంపై పడింది. దీంతో ఇంటి పైకప్పులో కొన్ని రేకులు పగిలిపోయి, కొన్ని గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. సుమారు 6 గంటల సమయంలో వాటర్ ట్యాంక్ వీధిలో నివాసముంటున్న వెంపాడ గురవమ్మ నివాసం వెనుక ఉన్న వేపచెట్టు పెద్ద శబ్దంతో ఆమె ఇంటిపై కూలిపోయింది. దీంతో ఇంటి పైకప్పులోని కొన్ని రేకులు పగిలిపోయి కొన్ని గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. దీనిపై సమాచారం తెలియడంతో వైఎస్సార్ సీపీ 50వ డివిజన్ ఇన్‌చార్జ్ బంకా విజయ, పార్టీ నాయకులు చాముండేశ్వరి ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పశ్చిమ తహసీల్దార్ జాహ్నవి ఘటన స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి

## అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలని గోళ్ల రామచంద్రరావు, బాలత్రిపురసుందరి చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ గోళ్ల రామచంద్రరావు అన్నారు. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (వస్త్రలత) ఆధ్వర్యంలో గోళ్ల రామచంద్రరావు, బాలత్రిపురసుందరి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వస్త్రలత గుమాస్తాల పిల్లలకు, టీసీఎంఏ పాఠశాల విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమాన్ని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ సమాజంలో విద్య మాత్రమే మానవులను చైతన్యవంతులను చేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని కోరారు. ఆ దిశగా కొనసాగుతున్న విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. తమ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నేత పోకూరి గంగా వెంకట రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వోలేటి జగన్‌మోహనరావు, కొత్త అనిల్‌కుమార్, సభ్యులు జీకేఆర్ నాగభూషణరావు, మద్ది సుబ్బారావు, పేర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాలు అందిస్తున్న గోళ్ల రామచంద్రరావు

## మహానటి జీవితం భావి నటులకు ఆదర్శం

**వేడుకగా సినీ నటి సావిత్రి జయంతి వేడుకలు**

విజయవాడ కల్చరల్: మహానటి నటజీవితం భావి నటీమణులకు ఆదర్శమని కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ నటి, నిర్మాత, దర్శకురాలు సావిత్రి జయంతి సావిత్రి స్మారక పురస్కారాలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి గొప్ప మానవతామూర్తిగా అభివర్ణించారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ ఆమె నడిచే నట గ్రంథాలయమని ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలరన్నారు. ప్రభల శ్రీనివాస్, బీవీ వీరభద్రరావు, చిట్టిబాబు, ఉమా బలరాం మాట్లాడారు. 2023వ సంవత్సరానికి గానూ పల్లెకొండ శ్రీనివాస్, చావా నరసింహారావులకు మహానటి సావిత్రి అవార్డులను అందజేశారు.



పల్లెకొండ శ్రీనివాస్, చావా నరసింహారావును సత్కరిస్తున్న విజయలక్ష్మి, ఉమాబలరాం

## నేటి నుంచి 144 సెక్షన్ అమలు

విజయవాడ స్పోర్ట్స్: ప్రజా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో ఈ నెల ఏడోవ తేదీ నుంచి 144 సీఆర్‌పీసీ కింద నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం తెలిపారు. 2024 జనవరి 25వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో నలుగురు, అంతకు మించి ఎక్కువ మంది ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడరాదని, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరించవద్దని సూచించారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఏర్పాట్ల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగనుంది. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు బుధవారం సాయంత్రం కళాక్షేత్రంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమ వేదిక, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, అగ్నిమాపక, తాగునీరు, పార్కింగ్ తదితర ఏర్పాటుపై సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

## మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి

**ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని**

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ముమ్మాటికీ ఖాయమని ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఘంటాపథంగా చెప్పారు. హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని కొమ్మినేనికి బహుకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ పలు సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ప్రతిపక్షాలతో కలిసి ఎల్లో మీడియా ఎంత యాగీ చేసిన ప్రజల అభిప్రాయాన్ని మార్చలేదని కొమ్మినేని స్పష్టం చేశారు. దీనికి తెలంగాణ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలకుండా ఈనాడు పత్రికల్లో వార్తలు రాసినప్పటికీ ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం మార్చలేకపోయారని, అలాగే ఏపీలోనే ఎల్లో మీడియా సీఎం వైఎస్ జగన్‌పై ఎంత దురద జల్లినా ప్రజలు విశ్వసించబోరని తేల్చి చెప్పారు. 2024లో మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటం ద్వారా రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీ మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, ఓఎస్డీ శ్రీనివాస్ జీవన్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

## పడవల నిండుగా ఖడిసె చేపలు

నాగాయలంక(అవనిగడ్డ): స్థానిక కృష్ణానదిలో బుధవారం రాత్రి మత్స్యకారులకు ఆశ్చర్యం కలిగించేలా మత్స్య సంపద లభించింది. నిత్యం పుష్కరఘాట్ ఎదురుగా అయిలు చేపట వేట జరిపే మత్స్యకారుల బృందానికి మూడు పడవలు నిండుగా ఖడిసె చేపలు దొరికాయి. గోదావరి కట్టె పరిగలు మాదిరిగా ఉండే ఈ చిన్న చేపల కిలో ధర రూ.30 మాత్రమేనని, వాటిని వలల నుంచి తప్పించడంలోనే శ్రమ అధికంగా ఉంటుందని మత్స్యకారులు పేర్కొన్నారు. మూడు పడవలను ఒకటిగా కట్టి ఈప్రాంతంలో సాయంత్రం నుంచి వేట సాగిస్తుంటారు. ఒక్కసారిగా సుడులు తిరుగుతూ వచ్చే ఈ చేపలు అయిలు వలలకు చిక్కడంతో రాత్రి ఏడు గంటల సమయంలో పడవలను మత్స్యకారులు దరికి చేర్చి చేపలను వలల నుంచి బయటకు తీశారు. మూడు టన్నులకు పైగా చేపలు లభించాయి. అయిలు వేటలో నిత్యం ఖడిసెలు దొరికినప్పటికీ కొద్ది మొత్తంలో ఉంటా యని, తుపాను కారణంగా వేట నిలిచి పోవడంతో గుంపుగా వలలకు చిక్కాయని మత్స్యకారులు తెలిపారు.



## ఉద్ధృతంగా పారుతున్న గుంటతిప్ప డ్రెయిన్

ఆటోనగర్(విజయవాడతూర్పు): గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు గుంటతిప్ప డ్రెయిన్ ఉద్ధృతంగా పారుతుంది. ఈ మురుగు కాలువల్లో ఉన్న వ్యర్థాలన్నీ కొట్టుకుపోతున్నాయి. సుమారు 7 అడుగులకు పైగా ఈ డ్రెయిన్ లోతు ఉంటుంది. దీని పక్కన ఉన్న పలు కాలనీలోని ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. గత రెండు రోజుల నుంచి శానిటేషన్ సిబ్బంది ఇంజిన్‌ల సహాయంతో నీటిని గుంటతిప్ప డ్రెయిన్‌లోకి మళ్లించడంతో నీరు భారీగా చేరింది. పంట కాలువ నుంచి బల్లెంవారి వీధి వరకు ఈ డ్రెయిన్ ఉంది. వర్షంతో వ్యర్థాలన్నీ కొట్టుకొస్తున్నాయి.

## 3 వేల మంది నర్సింగ్ విద్యార్థినులకు సీపీఆర్ శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో ఉన్న మూడు వేల మంది నర్సింగ్ విద్యార్థినులకు కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) శిక్షణ ఇచ్చినట్లు మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యుతారక్‌ప్రసాద్ తెలిపారు. ఐఆర్‌సీఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు ఆదేశాల మేరకు ప్రతి వైద్య కళాశాలలోని ఎనస్థీషియా ప్రొఫెసర్ నర్సింగ్ విద్యార్థులకు సీపీఆర్ విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థినిలందరికీ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఇఎంఎస్) సర్టిఫికెట్ అందచేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చునని ఆయన తెలిపారు.

**అత్యవసర ప్రథమ చికిత్సపై అవగాహన...**

ప్రాణాపాయంలో అందించాల్సిన అత్యవసర ప్రథమ చికిత్సా విధానాలపై బుధవారం ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కలిగించారు. చిన ఆవుటుపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొని కార్డియో పల్మనరీ రీ ససిటేషన్ విధానాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత, కార్యక్రమ సమన్వయకర్త గంటా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.